సాక్షి సంగారెడ్డి

శనివారం । 29 । జూన్ । 2024



వర్షాకాలం.. జీవాలు పదిలం

తొలకరి జల్లులు కురిసే సమయం మూగజీవాలకు గడ్డుకాలం. గొర్రెల పెంపకందారులు చాలా జాగ్రత్తలు పాటించాలి.

వివరాలు 8లో ▸



ప్రయాణం.. నరకప్రాయం

జహీరాబాద్ నియోజవర్గ పరిధిలోని రోడ్లు పూర్తిగా గుంతలమయంగా మారాయి.

వివరాలు 9లో ▸

నేడు డయల్ యువర్ డీఎం

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ బస్సు డిపోలో శనివారం ఉదయం 10:30 గంటల నుంచి 11:30 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక డిపో మేనేజర్ మల్లేశయ్య తెలిపారు. ఆర్టీసీ సేవలకు సంబంధించి ఏమైనా సమస్యలు, సలహాలు తెలియజేసేందుకు 9959223170 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

న్యూస్‌రీల్

జెడ్పీ మీటింగ్ వాయిదా

జూలై 4న నిర్వహించాలని నిర్ణయం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశం జూలై 4వ తేదీకి వాయిదా పడింది. మొదట ఈ సమావేశాన్ని ఈనెల 29న (శనివారం) నిర్వహించాలని నిర్ణయించారు. కానీ పార్లమెంట్ సమావేశాలు జూలై 3 వరకు కొనసాగుతుండటంతో జెడ్పీ సమావేశాన్ని వాయిదా వేసినట్లు అధికారులు తెలిపారు. జెడ్పీ పాలక వర్గం పదవీకాలం జూలై 5తో ముగుస్తుంది. దీంతో ఈ పాలక వర్గానికి ఇదే చివరి సమావేశం కానుంది.

పప్పు దినుసుల సాగు చేపట్టండి



ఫెర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఏఓ అంబికా సోనీ

నారాయణఖేడ్: పప్పు దినుసుల సాగు చేసి అధిక దిగుబడులు, మద్దతు ధర పొందాలని జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ రైతులకు సూచించారు. శుక్రవారం మనూరు మండలం మాయికోడ్ గ్రామ శివారులోని పత్తి, పెసర, మినుము పంటలను పరిశీలించారు. అనంతరం ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసి స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు మాత్రమే విక్రయించాలని డీలర్‌కు సూచించారు. ఏడీఏ నూతన్ కుమార్, ఏఓ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓలు సంగమేశ్వర్, రైతులు రాజ్‌కుమార్, శ్రీనివాస్, బస్వరాజ్ పాల్గొన్నారు.

బొగ్గు గనుల వేలంపై నిరసన



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

సంగారెడ్డి టౌన్ : బొగ్గు గనుల వేలాన్ని కేంద్ర ప్రభుత్వం ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు అతిమేల మాణిక్యం డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని ఐబీ నుంచి న్యూ బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను వేలం ద్వారా ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలనే నిర్ణయాన్ని కేంద్రం వెనక్కు తీసుకోవాలని అన్నారు. దీనివల్ల యువత ఉపాధి కోల్పోతారన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లేశం, సాయిలు, యాదగిరి, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీపై నిర్లక్ష్యం వద్దు



జేఎన్టీయూ హాస్టల్ మెస్‌లో వంట పాత్రలు పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్

సంగారెడ్డి : ఫుడ్ సేఫ్టీపై నిర్లక్ష్యం చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ధర్మేందర్ పాల్ హెచ్చరించారు. శుక్రవారం సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో ఆయన తనిఖీలు నిర్వహించారు. బాయ్స్ హాస్టల్లోని మెస్‌లో ఆహార నిల్వలను పరిశీలించారు. కళాశాలలో వంటగది అపరిశుభ్రంగా ఉండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టోర్‌లో ఆహార పదార్థాలు అపరిశుభ్రంగా ఉండటం, ముడిసరుకు నాసిరకంగా ఉండటం గుర్తించామని, నిర్వాహకులకు నోటీసులు కూడా జారీ చేసినట్లు తెలిపారు.



వామ్మో.. భౌభౌ

- వీధి కుక్కల వీర విహారం
- చిన్నపిల్లలపై దాడి
- ఒక్కరోజే ఐదుగురికి కాటు
- భయాందోళనలో జనం
- నివారణ చర్యలు నిల్

వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. నిత్యం ఏదో ఒక చోట చిన్నారులపై వీర విహారం చేస్తున్నాయి. చిన్నపిల్లల్ని బయటకు పంపించాలంటేనే తల్లిదండ్రులు హడలిపోతున్నారు. కుక్కలు గుంపులు, గుంపులుగా రోడ్లపై తిరుగుతూ పిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్రవాహనదారులను వెంబడించి పరుగులు పెట్టిస్తున్నాయి. రాత్రివేళల్లో మనుషులు కనిపిస్తే చాలు దాడులు చేసి గాయపరుస్తున్నాయి. కుక్కలు కనబడితే చాలు ప్రజలు తీవ్రభయాందోళనకు గురవుతున్నారు. ప్రతీరోజు ఏదో ఒకచోట వీధి కుక్కల బారిన పడి గాయపడిన సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఏదైనా ఘటన జరిగినప్పుడే స్పందించే అధికారులు తరువాత పట్టించుకోవడం లేదు.

పటాన్‌చెరు టౌన్:

పటాన్‌చెరు డివిజన్, మండల పరిధిలోని 19 గ్రామాల్లో వీధికుక్కల బెడద అధికంగా ఉంది. ఎక్కువగా చిన్నపిల్లలపై దాడి చేసి గాయపరిచిన సంఘటనలు ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం మండల పరిధి కర్దనూరు గ్రామంలో భాను(13) అనే బాలుడిని కుక్క కరవడంతో కుటుంబ సభ్యులు గ్రామపంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. అదేవిధంగా డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్ కాలనీ రోడ్ నంబర్ 7లో స్కూల్‌కు వెళ్లే పిల్లలపై కుక్కలు దాడి చేశాయి. వాటిని ఈ ప్రాంతం నుంచి తరలించాలని స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. నిబంధనల ప్రకారం కుక్కలను పట్టుకుని క్రిమిరహితం చేసిన తర్వాత.. వాటిని ఎక్కడి నుంచి పట్టుకొచ్చారో అక్కడే వదిలేయాల్సి ఉంటుంది.

పటాన్‌చెరులో ఒకేరోజు ఐదు కేసులు

పటాన్‌చెరు మండలంలో శుక్రవారం ఒక్కరోజే ఐదు కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. ఇస్నాపూర్‌లో బహిర్భూమికి వెళ్లిన ఆరేళ్ల బాలుడిని నాలుగు కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరచడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఘటన పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో 8 నెలల పాపపై కుక్క దాడి చేసింది. దీంతో పాపను పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చి మెరుగైన చికిత్స కోసం నిలోఫర్‌కు తరలించారు. పటాన్‌చెరు, లక్డారం, ఇంద్రేశంలో మరో ముగ్గురిపై కుక్కలు దాడి చేయడంతో చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి వచ్చినట్లు ఆర్ఎంఓ ప్రవీణ తెలిపారు.



పటాన్‌చెరులో వీధి కుక్కల సంచారం



జాగ్రత్తలు, సూచనలు

- కుక్క కరిచిన వ్యక్తి ఐదుసార్లు వ్యాక్సిన్ తీసుకోవాల్సి ఉంటుంది.
- కరిచిన రోజు, మూడో రోజు, ఏడవ రోజు, 14వ రోజు, 28వ రోజు భుజానికి రేబిస్ వ్యాక్సిన్ తీసుకోవాలి.
- కుక్క కాటు ప్రాంతంలో రక్తస్రావం అయితే ఈ వ్యాక్సిన్ తోపాటు రెండు రోజుల లోపు ఇమ్యునోగ్లోబిలిన్ ఇంజెక్షన్‌ను కరిచిన చోట తీసుకోవాలి.
- ఈ ఇంజెక్షన్ శరీరానికి ఇమిడియట్ బూస్టర్‌లా పనిచేస్తుంది.
- దీనివల్ల రేబిస్ వ్యాధి సోకకుండా ఉంటుంది.
- రేబిస్ వ్యాధి సోకితే ప్రపంచంలో ఎక్కడా ట్రీట్మెంట్ లేదని వైద్యులు తెలిపారు.

జూన్‌లో 96 కేసులు



పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏఆర్‌వీ(యాంటీ రేబిస్ వ్యాక్సిన్) అందుబాటులో ఉంది. జూన్ నెలలో 96 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. శుక్రవారం ఒక్కరోజే పటాన్‌చెరు, ఇస్నాపూర్, ముత్తంగి, లక్డారం, ఇంద్రేశం నుంచి ఐదు కేసులు వచ్చాయి. వారికి వ్యాక్సిన్ ఇచ్చాం.

– డాక్టర్ ప్రవీణ, ప్రభుత్వ ఆస్పత్రి ఆర్ఎంఓ

శంకర్‌దాదా ఎంబీబీఎస్

అర్హతలు, అనుమతులు లేకుండా ఆస్పత్రుల నిర్వహణ

- నిబంధనలు గాలికి
- 39 ప్రైవేట్ క్లినిక్‌ల సీజ్
- జిల్లా వ్యాప్తంగా వైద్యశాఖ తనిఖీలు

చౌటకూర్‌లో ఓ ఆర్ఎంపీ లక్ష్మీ వినాయక ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరుతో ఆస్పత్రిని తెరచి.. అందులో బెడ్లు ఏర్పాటు చేసి వైద్యం చేస్తున్నాడు. ఎలాంటి అర్హతలు లేని ఈ ఆర్ఎంపీ తెలిసీ తెలియక చేసిన వైద్యం వికటించి మల్లేశ్ అనే వ్యక్తి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైద్యారోగ్యశాఖ అధికారులు ఈ ఆస్పత్రిని ఇటీవల సీజ్ చేశారు. స్థానిక పుల్కల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సంగారెడ్డిలో బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఓ ఆస్పత్రిలో నిబంధనలు పాటించకుండా స్కానింగ్ నిర్వహిస్తున్నారు. రికార్డులు కూడా నిర్వహించకుండా ఇష్టానుసారంగా స్కానింగ్ సెంటర్‌ను నడుపుతుండటంతో వైద్యారోగ్యశాఖ అధికారులు దానిని జప్తు చేశారు.

జహీరాబాద్ పట్టణంలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఓ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. కనీస అర్హతలు లేని వ్యక్తులు ఈ దందా కొనసాగిస్తుండటంతో అధికారులు ఈ ల్యాబ్‌ను సీజ్ చేశారు.



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి : వైద్యారోగ్యశాఖ శంకర్‌దాదా ఎంబీబీఎస్‌లపై ఉక్కుపాదం మోపుతోంది. ఎలాంటి అర్హతలు లేకుండా ఆస్పత్రులను తెరిచి ఇష్టానుసారంగా వైద్యం చేస్తున్న వారిపై చర్యలు చేపట్టింది. అనుమతులు లేని క్లినిక్‌లను సీజ్ చేస్తోంది. ఇలా ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 39 ఆస్పత్రులను సీజ్ చేశారు. జిల్లాలో మొత్తం 472 ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. ఇందులో ఒక పడక నుంచి 200 పడకల సామర్థ్యం ఉన్న ఆసుపత్రులు కూడా ఉన్నాయి.

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు..

జిల్లాలో ఆస్పత్రుల తనిఖీలు కొనసాగుతున్నాయి. ఇందుకోసం వైద్యశాఖ ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. సంగారెడ్డితో పాటు, పటాన్‌చెరు, జహీరాబాద్, సదాశివపేట, నారాయణఖేడ్, ఆందోల్ వంటి పట్టణాల్లో ఈ తనిఖీలు సాగుతున్నాయి. నిబంధనల ప్రకారం క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు కింద అనుమతులు తీసుకుని ఆస్పత్రులు నిర్వహించాలి. అలాగే బెడ్‌ల సామర్థ్యం, వైద్యసేవలు, పరీక్షలకు తీసుకుంటున్న చార్జీల వివరాలను తెలుగులో బోర్డుపై ప్రదర్శించాలి. కానీ ప్రైవేటు ఆస్పత్రుల్లో ఇవేవి కనిపించవు. ఈ తనిఖీల్లో ఆశ్చర్యానికి గురిచేసే విషయాలు చాలా వెలుగులోకి వస్తున్నాయి.

తనిఖీల్లో వెల్లడైన నిజాలు

- ఎంబీబీఎస్ చదివిన వారే ఆస్పత్రి ఏర్పాటు చేసుకొని వైద్యం చేయాలి. కానీ.. ఆయుష్, యూనాని చదివిన వారు కూడా హలోపతి ఆస్పత్రులు తెరచి వైద్యం చేస్తున్నట్లు వైద్యారోగ్యశాఖ తనిఖీల్లో వెల్లడైంది.
- ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు కూడా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు తేలింది. అనుమతులు తీసుకున్న సెంటర్లు కనీసం నిబంధనలు పాటించడం లేదని అధికారులు పరిశీలనలో తేలింది.
- చాలావరకు ప్రైవేటు ఆస్పత్రులకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి అనుమతులు లేవు. అలాగే అగ్నిమాపకశాఖ నుంచి కూడా పర్మిషన్ తీసుకోవడం లేదు. ఆస్పత్రుల నుంచి వచ్చే బయో వేస్టేజీని ఇష్టానుసారంగా పారవేస్తుండటంతో పర్యావరణానికి విఘాతం కలుగుతోంది.



సాహితీ ఆస్పత్రిలోని స్కానింగ్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ గాయత్రీదేవి

నిరంతర తనిఖీలు

ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీలకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు 212 ఆస్పత్రులను తనిఖీ చేశాం. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు నిబంధనల ప్రకారం ఆస్పత్రులను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు పాటించని ఆస్పత్రులను, స్కానింగ్ కేంద్రాలను, రోగనిర్ధారణ పరీక్షా కేంద్రాలను సీజ్ చేస్తున్నాం. అవసరమైతే ముందుగా వాటిని నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ గాయత్రీదేవి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి



న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ క్రాంతి

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కలెక్టర్ వల్లూరి క్రాంతి

సంగారెడ్డి టౌన్ : కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. శుక్రవారం జిల్లా శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 'భేటీ బచావో.. భేటీ పడావో'లో భాగంగా కలెక్టరేట్‌లో గర్ల్ చైల్డ్ న్యూట్రీషన్ కిట్లను అందించారు. జిల్లాలో కిశోర బాలికలకు 360 కిట్లను అందించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, డీసీపీఓ రత్నం, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త పల్లవి పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాలలో చేపట్టిన మరమ్మతు పనులు వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీ భవన నిర్మాణాల్లో నాణ్యత పాటించాలన్నారు. పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించాలి

కేజీబీవీ విద్యార్థులకు హృదయ ఆధారిత విద్యాబోధన, నైపుణ్యాల పెంపుపై ప్రాజెక్టు నిపుణ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ క్రాంతి సూచించారు. విద్యార్థులకు ప్రాజెక్టులు, మెడిటేషన్ వంటివి అలవాటు చేయాలన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు, మహిళా క్యాంటీన్లు, చిన్న పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర రంగాలలో మహిళలు ముందున్నారని తెలిపారు. మహిళలకు ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్డీఓ జ్యోతి, అదనపు డీఆర్డీఓ జంగారెడ్డి పాల్గొన్నారు.

ప్రజల అవసరాల మేరకు రుణాలు

నారాయణఖేడ్: ప్రజల అవసరాల మేర రుణాలు ఇచ్చి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పడేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ డీజీఎం జి.శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న డీసీసీబీ బ్రాంచి భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ... కమర్షియల్ బ్యాంకులను మించి డీసీసీబీ సేవలందిస్తుందని తెలిపారు. దీర్ఘకాలిక, స్వల్పకాలిక, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు, వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు అందిస్తున్నామని చెప్పారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 10వేల మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.450కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. రికవరీ కూడా 95శాతంగా ఉందన్నారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అన్ని బ్యాంకులకంటే అధిక వడ్డీని అందిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట బ్రాంచి మేనేజరు వెంకటేశం, ఖేడ్ పీఏసీఎస్ చైర్మన్ శోభారాణి అశోక్‌రెడ్డి, కార్యదర్శి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్‌కు జాతీయ హోదా

ఉమ్మడి మెదక్ జిల్లాకు భారీ ప్రయోజనం

గజ్వేల్: ట్రిపుల్ ఆర్‌కు జాతీయ హోదా దక్కడంతో ఉమ్మడి మెదక్ జిల్లాకు భారీ ప్రయోజనం కలగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి న్యూఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమై ట్రిపుల్‌ఆర్ దక్షిణభాగానికి జాతీయ హోదా కల్పించాలని కోరిన విషయం విదితమే. ఉత్తరభాగానికి ఇప్పటికే కేంద్రం జాతీయ హోదా ప్రకటించిన నేపథ్యంలో ఈ ఏడాది నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) వార్షి ప్రణాళికలో చేర్చి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. ఈ క్రమంలో పనుల ప్రారంభంపై ఆశలు చిగురిస్తున్నాయి.

ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగంలో చౌటుప్పల్– భువనగిరి–జగదేవ్‌పూర్–గజ్వేల్–తూప్రాన్–నర్సాపూర్–సంగారెడ్డి వరకు 158కిలోమీటర్ల విస్తరించనున్నది. ప్రస్తుతం ఈ భాగంలో భూసేకరణను ముమ్మరం చేశారు. దక్షిణ భాగం చౌటుప్పల్, ఆమనగల్లు, షాద్‌నగర్ మీదుగా సంగారెడ్డి వరకు 181కిలోమీటర్ల విస్తరించనున్నది. దక్షిణ భాగం ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉన్నది. దక్షిణ భాగానికి జాతీయ హోదా ఇవ్వాలని తాజాగా కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులతో కలిసి విజ్ఞప్తి చేశారు. ఇదే క్రమంలో ఇప్పటికే జాతీయ రహదారిగా ప్రకటించిన ఉత్తర భాగాన్ని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) వార్షిక ప్రణాళికలో చేర్చాలని కూడా సీఎం కోరారు. దీంతో ఉత్తర భాగం పనుల ప్రారంభంపై ఆశలు నెలకొన్నాయి. ఇప్పటికే ఈ భాగంలో భూసేకరణ ప్రక్రియ వేగంగా సాగుతోంది. రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగంలో 158కిలోమీటర్ల నిడివికి గానూ ఉమ్మడి మెదక్ జిల్లాలో 110కిలోమీటర్లకుపైనే విస్తరించనుంది. ఈ జిల్లా పరిధిలోని జగదేవ్‌పూర్–గజ్వేల్–తూప్రాన్–నర్సాపూర్–సంగారెడ్డి మీదుగా కంది వరకు ఈ రోడ్డు విస్తరించనున్నది. ఈ క్రమంలో ఈ రోడ్డు భువనగిరి వద్ద 163 నంబర్ నేషనల్ హైవేతో, గజ్వేల్‌లో రాష్ట్ర హైవే రాజీవ్‌రహదారితో, తూప్రాన్ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిని, సంగారెడ్డి వద్ద 161 నంబర్ జాతీయ రహదారితో అనుసంధానం కానుంది. వీటితోపాటు ప్రధానంగా దేశంలోని వివిధ హైవేలతో ఇప్పటికే అనుసంధానమై ఉన్నా.. హైదరాబాద్ అవుటర్ రింగు రోడ్డుతో కూడా అనుసంధానం కానుంది. భవిష్యత్తులో హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డుకు ట్రిపుల్ ఆర్ (రీజినల్ రింగు రోడ్డు)ను రేడియల్ రోడ్లతో అనుసంధానం చేసే ప్రతిపాద ఉంది. ఈక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని గజ్వేల్, నర్సాపూర్, సంగారెడ్డి నియోజకవర్గాల్లోని పలు మండలాలు మెగా హెచ్ఎండీఏలో విలీనం కానున్నాయి. దీని ద్వారా పారిశ్రామిరంగ విస్తరణతోపాటు కొత్త ఐటీ కంపెనీల రాకకు అంకురార్పణ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇందుకోసం గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగు, మర్కూక్, జగదేవ్‌పూర్, వర్గల్, తూప్రాన్, మనోహరాబాద్‌తోపాటు నర్సాపూర్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో పలు మండలాల్లో దీని ప్రభావం కనిపించనున్నది.

లీడర్ల గుండెల్లో.. విలీన గుబులు

జీహెచ్ఎంసీ పరిధిలోకి తెల్లాపూర్ మున్సిపాలిటీ?

- కలవరపడుతున్న రాజకీయ నాయకులు
- పదవులు కోల్పోతామని ఆవేదన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ జీహెచ్ఎంసీలో విలీనం అవుతుందని ప్రచారం జరుగుతోంది. ఈ విషయం స్థానిక నేతలు, ప్రజలను కలవరానికి గురిచేస్తోంది. కౌన్సిలర్లు తమ పదవులు ఎక్కడ కోల్పోతామోనని గుబులు పడుతున్నారు. అలాగే అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి దూరమవుతామని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

రామచంద్రాపురం మండలంలో తెల్లాపూర్ గ్రామ పంచాయతీగా ఉండేది. ఈ ప్రాంతంలో రియల్ వ్యాపారం జోరుగా సాగుతుండటంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్, కొల్లూర్, ఈదులనాగులపల్లి, వెలిమెల గ్రామాలను కలిపి తెల్లాపూర్ మున్సిపాలిటీగా ప్రకటించింది. 17 వార్డులను కూడా ఏర్పాటు చేసింది. మున్సిపల్ ఎన్నికల్లో ఆశావహులందరూ కౌన్సిలర్లుగా పోటీ చేశారు. ఇదంతా జరిగి సుమారు ఐదేళ్లవుతోంది. ప్రజాప్రతినిధులకు మరో మూడు నాలుగు నెలల పదవీకాలం ఉంది. ఈసారి జరిగే ఎన్నికల్లో కౌన్సిలర్లుగా పోటీ చేసేందుకు కొందరు లీడర్లు సిద్ధమవుతున్నారు. అయితే తెల్లాపూర్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తారనే వార్త నాయకులను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. జీహెచ్ఎంసీ విలీనమైతే రాజకీయ పదవులు పొందలేమన్న భావనలో కార్యకర్తలున్నారు.

10 ఏళ్ల క్రితమే ప్రతిపాదనలు

తెల్లాపూర్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని పదేళ్ల క్రితమే ప్రతిపాదించారు. నాటి కలెక్టర్ స్థాయి అధికారులు తెల్లాపూర్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయొచ్చని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. కానీ ఆ సమయంలో స్థానిక ప్రజాప్రతినిధులు అందుకు నిరాకరించారు. దాంతో కొంత కాలం తరువాత పంచాయతీ కాస్త మున్సిపాలిటీగా ఏర్పడింది.

తెల్లాపూర్ మున్సిపాలిటీగా..

రామచంద్రాపురం మండలంలోని ఐదు గ్రామాలను కలిపి తెల్లాపూర్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్, కొల్లూర్, ఈదులనాగులపల్లి, వెలిమెల గ్రామపంచాయతీలను కలిపారు. అయినా గానీ హైదరాబాద్‌ను ఆనుకుని ఉన్న తెల్లాపూర్‌ను సెమీ అర్బన్‌గా చెప్పుకుంటున్నప్పటికీ ఇక్కడి ఇంకా గ్రామీణ వాతావరణమే ఉంటుంది. ఇక ఈ ప్రాంతాన్ని జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే ఇబ్బందులు తప్పవని స్థానికులు అంటున్నారు.



తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయం

ఆశ.. నిరాశ

ఐదేళ్లుగా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో అన్ని పార్టీలకు చెందిన కార్యకర్తలు, నాయకులు ముందు చూపుతో వారి పార్టీల కోసం కష్టపడుతూ వస్తున్నారు. భవిష్యత్‌లో తాము కూడా కౌన్సిలర్‌లుగా పోటీ చేస్తామనే ధీమాలో ఉన్నారు. ప్రధానంగా 10 ఏళ్లు ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు అధికారంలో ఉండటం కూడా ఇందుకు కారణం. తెల్లాపూర్‌ను జీహెచ్ఎంసీలో విలీనం వార్తలు వెలువడటంతో వారు నిరాశకు లోనవుతున్నారు. తాము రాజకీయ పదవులకు దూరం కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, మున్సిపల్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారు. నేరుగా కలిసి వారి సమస్యలను నివేదించేవారు. అవసరమైతే కౌన్సిలర్‌లను నిలదీసే అవకాశం ఉంటుంది. కానీ జీహెచ్ఎంసీలో విలీనమైతే సమస్యలు చెప్పుకోవడం కష్టం అవుతుందనే అభిప్రాయం స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

ఆటపాటలతో విద్యాబోధన

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి బ్రహ్మాజీ



మెదక్ కలెక్టరేట్: అంగన్‌వాడీ పిల్లలకు ఆటపాటలతో విద్య నేర్పించేందుకు టీచర్లకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నామని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి బ్రహ్మాజీ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆమె మాట్లాడతూ అంగన్‌వాడీ పిల్లలకు ఆటలు, పాటలు, కథలు, కబుర్లతో ప్రియదర్శిని అనే నూతన పుస్తకంద్వారా పూర్వ ప్రాథమిక విద్య నేర్పించనున్నట్టు చెప్పారు. అందుకోసం జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లను 30బ్యాచ్‌లుగా విభజించి, సమీప ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో శిక్షణ ఇస్తామని తెలిపారు. రెండు విడతల్లో ఎనిమిది బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామని, మరో 22 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వాల్సి ఉందన్నారు. 1 నుండి మూడో విడత శిక్షణ ప్రారంభించి 10వ తేదీలోగా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు శిక్షణ పొందిన టీచర్లు బోధన ప్రారంభించినట్లు తెలిపారు.

దాడి కేసులో రిమాండ్

కొండపాక(గజ్వేల్): వార్తాసేకరణ కోసం వెళ్లిన విలేకరిపై దాడిచేసి గాయపర్చిన తండ్రీకొడుకులు జక్కుల మల్లేశం, జక్కుల స్వామిని శుక్రవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. మండల పరిధిలోని దుద్దెడ శివారులో గత 20న అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు విలేకరి నర్సింహారెడ్డి తోపాటు మరో ఇద్దరు వెళ్లి జేసీబీ, టిప్పర్ల ఫొటోలు తీసుకొని వస్తున్నారు. ఈ క్రమంలో తండ్రీకొడుకులు అతడినిపై దాడిచేశారు. దీంతో నర్సింహారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం నిందితులను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

హత్యా? ఆత్మహత్యా?

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో యువతి మృతిచెందడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన ఓ యువతి బొల్లారం మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్‌లో ఒంటరిగా నివాసం ఉంటోంది. గత 19న ఆ యువతి తన ఇంట్లో మృతిచెందింది. ఎస్‌ఐ దశరథ్ అప్పట్లో అనుమానాస్పద స్థితిలో యువతి మృతిగా కేసు నమోదు చేశారు. యువతి ఫోన్ నంబర్ ఆధారంగా ఆమె మేనమామను పోలీసులు విచారించారు. ఆయువతిని రాజస్థాన్‌కు చెందిన ప్రియ(19)గా గుర్తించారు. తలపై గాయాలు కావడంతో ఎవరైనా హత్యచేసి ఉంటారని భావిస్తున్నారు. హత్యా, ఆత్మహత్యా అనే విషయంపై దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వర్షాకాలం.. జీవాలు పైలం

- గొర్రెలకు చిటుకు వ్యాధి సోకే ప్రమాదం
- తిమ్మాపూర్ పశువైద్యాధికారి శ్రీనివాస్



తొలకరి జల్లులు కురిసే సమయం మూగజీవాలకు గడ్డుకాలం. వానలు మొదలైనప్పుడు మొలిసిన పచ్చిగడ్డిని గొర్రెలు, మేకలు ఇష్టంగా తింటాయి. దానివల్ల చిటుకు వ్యాధి బారిన పడుతుంటాయి. దీనినే నెత్తిపిదుగు, గడ్డిరోగం, పాటు రోగం అని కూడా అంటారు. ఈ వ్యాధి నివారణకు గొర్రెల పెంపకందారులు చాలా జాగ్రత్తలు పాటించాలి. ఒక్కోసారి మంద మొత్తం మృత్యువాత పడే అవకాశం ఉంది. దీంతో చాలా నష్టం సంభవిస్తుంది. దానిని నివారించుకోవడానికి తిమ్మాపూర్ పశువైద్యాధికారి శ్రీనివాస్ ఇచ్చిన సలహాలు, సూచనలు ఇలా ఉన్నాయి.



పశువైద్యాధికారి శ్రీనివాస్

– దుబ్బాకటౌన్

బలిష్టంగా పెరిగిన గొర్రెలే ఎక్కువగా ఈ వ్యాధి బారినపడే అవకాశం ఉంది. తొలకరి చినుకులతో పెరిగిన పచ్చిగడ్డిపై క్లాస్ట్రీడియం అనే బాక్టీరియా వదిలిన విష పదార్థం ఉంటుంది. ఆ సూక్ష్మజీవులు జీవాల ప్రేవుల్లో చేరి అభివృద్ధి చెందుతాయి. అవి చిటుకు వ్యాధికి కారణమవుతాయి. ఈ వ్యాధి జూన్ 2వ వారం నుండి జూలై నెలాఖరు వరకు ఎక్కువగా సంభవిస్తుంది.

వ్యాధి లక్షణాలు

ఈ వ్యాధి సోకిన గొర్రెలు సాధారణంగా ఎలాంటి లక్షణాలు కనిపించకుండానే అకస్మాతుగా మరణిస్తాయి. చనిపోయే ముందు చాలా నీరసంగా ఉంటాయి. ఎగిరి కిందపడి కాళ్లు కొట్టుకుంటూ, పళ్లు కొరకుతూ.. బిగుసుకుని కొన్ని క్షణాల్లో చనిపోతాయి. వ్యాధిసోకిన మరికొన్ని గొర్రెలు చొంగ కారుస్తుంటాయి. శ్వాస అధికంగా ఉంటుంది. జీవాలు మేత మేయక, నెమరువేయక తలలు వాల్చి ముడుచుకుని ఒకే చోట నిలబడతాయి. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పశువైద్యాధికారిని సంప్రదించి చికిత్స చేయించాలి.

నివారణ ముఖ్యం

చికిత్స కంటే వ్యాధి నివారణే ముఖ్యం. ఏటా ఏప్రిల్, మే నెలల మధ్యలో వ్యాధి నిరోధక టీకా(మల్టీ కాంపోనెంట్ ఈటీ వ్యాక్సిన్) మందలో ఉన్న జీవాలన్నింటికి తప్పకుండా వేయించాలి. రెండో విడత టీకాలు అక్టోబర్, నవంబరు నెలల మధ్య వేయించాలి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో పశువైద్యాధికారికి తెలియజేసి చికిత్స, జాగ్రత్తలు పాటించాలి. తొలకరి వర్షాలకు మొలిసి వాడిపోయిన గడ్డిని మేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సాయంత్రం సమయంలో జీవాలను మేపకూడదు. వ్యాధిసోకిన జీవాలను వెంటనే మంద నుండి వేరుచేయాలి. జాగ్రత్తలు పాటిస్తే చిటుకు వ్యాధి బారి నుండి జీవాలను కాపాడుకోవచ్చు.



వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది



నారాయణఖేడ్: జీలుగ సాగును పరిశీలిస్తున్న ఏడీఏ నూతన్‌కుమార్ తదితరులు

పచ్చిరొట్టతో భూసారం అధికం

ఏడీఏ నూతన్ కుమార్

నారాయణఖేడ్: వరి మాగాణుల్లో పచ్చిరొట్ట పెంచడం వల్ల భూసారం పెరిగి అధిక దిగుబడులు సాధించవచ్చని సహాయ వ్యవసాయ అధికారి(ఏడీఏ) నూతన్ కుమార్ సూచించారు. నిజాంపేట్ మండలంలోని నాగ్‌ధర్ గ్రామంలో జీలుగ పచ్చిరొట్ట వేసిన రైతు పొలాన్ని ఆయన ఏఈఓ భాస్కర్‌తో కలిసి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువులు అధికంగా వాడటం వల్ల నేలల్లో భూసారం పూర్తిగా తగ్గిపోయిందన్నారు. పచ్చిరొట్ట సాగుచేసి భూమిలో కలియదున్నడం వల్ల భూమి గుల్లబారి, భూమిలో సేంద్రీయ కర్బనం అధికమై ఒక బస్తా డీఏపీ వేసినంత విలువ దక్కుతుందని వివరించారు. 45రోజుల వ్యవధిలో పూతదశలో ఉన్నపుడు ఎకరాకు 100కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్ వేసుకుని రోటోవేటర్ సహాయంతో కలియదున్నితే ఆరోగ్యవంతమైన పంట పండుతుందని చెప్పారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పెట్టుబడులు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

రసాయన ఎరువులు తగ్గించాలి..

కల్హేర్(నారాయణఖేడ్): పచ్చిరొట్టను భూమిలో కలియదున్నడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ రైతులకు సూచించారు. మండలంలోని మాసాన్‌పల్లి, నిజాంపేట మండలం బాచేపల్లి, మునిగేపల్లిలో శుక్రవారం ఆయన జీలుగ, వరి నారు మళ్లను పరిశీలించారు. పచ్చిరొట్టతో భూసారం పెరిగి పంటసాగులో ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు వాడవద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు భాస్కర్, కృష్ణవేణి, సంతోష పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో వేలం పాటలు

- పలు టెండర్లు ఖరారు
- మరికొన్ని వాయిదా

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో పలు బహిరంగ వేలం పాటలు ఈఓ బాలాజీశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆలయ పరిసరాలలో కొబ్బరికాయలు విక్రయించుకొనేందుకు సిలువేరు కనకమల్లేశం రూ.32.50లక్షలకు అధిక పాటపాడి హక్కులను పొందారు. సులభ్ కాంపెక్స్ నిర్వహణ హక్కులను రూ.4.51లక్షలకు మిత్ర ఎంటర్ ప్రైజెస్ ప్రతినిధులు దక్కించుకున్నారు. అలాగే ఎల్లమ్మ ఆలయం వద్ద కూల్‌డ్రింక్స్, పూజా సామగ్రి విక్రయించుకునే హక్కులను రూ.15.65లక్షలకు ఎస్.వెంకటేశ్ పొందాడు. స్వామి వారి కోరమీసాలు విక్రయించే హక్కును రూ.16.25లక్షలకు ఎ.అరుణ, అలాగే ఎల్లమ్మ ఆలయం వద్ద ఒడిబియ్యం, వస్త్రాల సేకరణకు రూ.15.60లక్షలకు పి.కుమారస్వామి టెండర్ దక్కించుకున్నారు. లడ్డు, పులిహోర ప్రసాదాల తయారీ హక్కులను రావికంటి సత్యనారయణ పొందారు. కూరగాయలు సప్లయ్‌చేసేందుకు ముత్యం రవి, పాలు సప్లయ్ చేసేందుకు రసులాబాద్‌కు చెందిన మల్లేశం, పూల దండలకు కుమారస్వామి హక్కులు పొందారు. ఆలయంలో ఫొటోలు, వీడియోలు తీసేహక్కు టెండర్‌ను ఆర్.నవీన్; ఆలయానికి చెందిన పలు టికెట్ల ముద్రణకు సంబంధించిన హక్కును ముల్కనూర్‌కు చెందిన లక్ష్మీ ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధులు పొందారు.



టెండర్లు నిర్వహిస్తున్న ఈఓ బాలాజీ

పలు టెండర్లు వాయిదా..

ఆలయంలో కొబ్బరి ముక్కలు, తలనీలాల సేకరణ; ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయం, పాదరక్షలు, స్వామివారి వస్త్రాలు, ఒడిబియ్యం బండారి సేకరణకు, మొక్కుబడి వస్త్రాల కోసం నిర్వహించిన టెండర్లలో సరైన పాట రాకపోవడంతో ఈఓ బాలాజీ వాటిని వాయిదా వేశారు. వచ్చేనెల 8న నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏఈఓలు శ్రీనివాస్, శ్రీనివాస్, అర్చకుడు మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

వైద్యుల నిర్లక్ష్యమే అంటూ బంధువుల ఆందోళన



కుమార్ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడిని ఆసుపత్రిలోచేర్చగా శస్త్ర చికిత్స అనంతరం అకస్మాత్తుగా చనిపోవడం ఆందోళనకు దారితీసింది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బిహార్‌కు చెందిన అజయ్‌గుప్తా తన కుటుంబంతో 20సంవత్సరాల క్రితం ఇంద్రేశం గ్రామ పరిధి ఆర్కే నగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. అతనికి ముగ్గురు కొడుకులు ఉన్నారు. పెద్ద కుమారుడు ఆకాశ్ కుమార్ గుప్తా (24) లక్దారం గేటు సమీపంలో ఉన్న సిగ్నోడ్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకుని స్నేహితుడు సాయితో కలిసి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో బచ్చుగూడెం పద్మావతి ఫంక్షన్ హాల్ వద్దకు వచ్చేసరికి టైరుపేలడంతో బైక్ అదుపుతప్పింది. దీంతో వెనుక కూర్చున్న ఆకాశ్ కుమార్ గుప్తా(24)కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఇంద్రేశం పరిధిలో ఉన్న మెడిస్టార్ ఆసుపత్రిలో చేర్చారు. వైద్యులు తలకు శస్త్ర చికిత్స నిర్వహించారు. శుక్రవారం గుండెపోటు రావడంతో అతను మృతి చెందాడు. అయితే వైద్యులు నిర్లక్ష్యం మూలంగానే చనిపోయాడని వారి బంధువులు, స్నేహితులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీడీఎల్ సీఐ రవీందర్ రెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. ఆందోళన చేస్తున్న వారికి సీఐ ప్రవీణ్ కుమార్ సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. దీంతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే బాధితులకు సంబంధం లేని వ్యక్తులు వచ్చి వైద్యులపై దాడిచేశారని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా ఇచ్చామని ఆసుపత్రి ఎండీ గైనకాలజిస్ట్ లత తెలిపారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ ప్రవీణ్ రెడ్డి

మరో ఘటనలో యువతి..

గజ్వేల్‌రూరల్: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ యువతి మృతి చెందగా వైద్యుల నిర్లక్ష్యమే అంటూ ఆమె కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగిన ఘటన గజ్వేల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుకునూర్‌పల్లి మండలం మంగోల్‌కు చెందిన మేడబోయిన కల్యాణి(19) సంగాపూర్ మార్గంలోగల ఓ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తోంది. రోజూ మాదిరిగానే బుధవారం ఆసుపత్రికి వచ్చిన ఆమె అస్వస్థతకు గురైంది. స్థానిక వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు శుక్రవారం గజ్వేల్‌లోని ప్రైవేటు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలంటూ బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు.



కల్యాణి(ఫైల్)

మరో వ్యక్తి..

సంగారెడ్డి టౌన్: వైద్యుల నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి చెందాడని అతడి బంధువులు ఆందోళనకు దిగిన ఘటన మండలంలోని ఎమ్మెన్నార్ ఆస్పత్రి వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. సంగారెడ్డి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంది మండలం బేగంపేట తండాకు చెందిన పాండు(48) అనారోగ్యం బారిన పడడంతో గురువారం అతడి కుటుంబ సభ్యులు ఎమ్మెన్నార్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. అయితే వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి చెందాడని మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతుడి బంధువులతో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అడవిపందిని తప్పించబోయి..

- లారీని ఢీకొన్న కారు
- ఒక వ్యక్తి మృతి



మహేశ్‌గౌడ్(ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): కారులో వెళ్తుండగా రోడ్డుపై అకస్మాత్తుగా అడ్డువచ్చిన అడివిపందిని తప్పించబోయి ఆగిఉన్న లారీని ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని తునికి గేట్‌వద్ద జాతీయ రహదారిపై గురువారం అర్ధరాత్రి జరిగింది. శుక్రవారం స్థానిక ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం జక్కపల్లి గ్రామానికి చెందిన కొనింటి మహేశ్‌గౌడ్(32) గురువారం రాత్రి తన కారులో తునికిగేట్ వద్దగల నర్సాగౌడ్ వద్దకు వెళ్లివస్తానని భార్యకు చెప్పి కారులో బయలుదేరాడు. ఈ క్రమంలో రహదారిపై అడవిపంది అడ్డుగా వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో కారు అదుపుతప్పి పక్కనే ఆగిఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో కారు లారీవెనక భాగంలో చొచ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో మహేశ్‌గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో కారును బయటకు తీయించారు. కారులో చిక్కుకుపోయిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

నిందితుడికి మూడేళ్లు జైలు

కంది(సంగారెడ్డి): బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఓ నిందుతుడికి పోక్సో కోర్టు మూడేళ్లు జైలుశిక్ష విధించింది. శుక్రవారం జిల్లా పోక్సో కోర్టు అదనపు న్యాయమూర్తి కె.జయంతి ఈ తీర్పును వెలువరించారు. రూరల్ ఎస్‌ఐ కథనం ప్రకారం చెందిన బేగరి మురళి 2017లో ఓ బాలికపై అసభ్యంగా ప్రవర్తించి, ఇబ్బందులకు గురిచేశాడు. దీంతో బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అప్పటి రూరల్ సీఐ శివలింగం కేసు నమోదుచేసి కోర్టులో హాజరు పరిచారు. అడిషనల్ పీపీ కె.కృష్ణ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో నిందితునికి మూడేళ్లు జైలుశిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

యువకుడిపై పోక్సో కేసు

తూప్రాన్: ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోక్సోకేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం శుక్రవారం తెలిపారు. పట్టణంలో కొంత కాలంగా నివాసం ఉంటున్న ఓ బాలికపై వెల్దుర్తి మండలానికి చెందిన నరేశ్ అత్యాచారానికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో ఆ యువకుడిపై శుక్రవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్రంలో మెదక్ రెండో స్థానం

- స్ట్రీట్ వెండర్లకు అత్యధిక రుణాలు
- జిల్లాకు రూ.40.50కోట్ల టార్గెట్
- ఇప్పటి వరకు రూ.10.20కోట్లు పూర్తి
- మెప్మా పీడీ ఇందిర

మెదక్ కలెక్టరేట్: మెప్మా ఆధ్వర్యంలో స్ట్రీట్ వెండర్ల అభివృద్ధికి అత్యధిక రుణాలు అందిస్తున్నామని, రాష్ట్రంలో జిల్లా రెండోస్థానంలో ఉందని మెప్మా పీడీ ఇందిర తెలిపారు. మహిళా సంఘాల రుణాల లక్ష్యంపై శుక్రవారం తన కార్యాలయంలో ఆర్పీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానిగాను జిల్లాలో మహిళా సంఘాల సభ్యులకు రూ.40.50కోట్ల రుణాలు పంపిణీ చేయాలని టార్గెట్‌గా నిర్ణయించినట్లు తెలిపారు. ఇందులో మెదక్ మున్సిపాలిటీకి రూ.17కోట్లు, తూప్రాన్ రూ.9కోట్లు, నర్సాపూర్ రూ.7.5కోట్లు, రామాయంపేట రూ.7కోట్ల చొప్పున అందజేయాల్సి ఉందని చెప్పారు. కాగా ఇప్పటి వరకు రూ.10.20కోట్లు మహిళా సంఘాలకు అందజేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఇప్పటి వరకు స్ట్రీట్ వెండర్లకు రూ.10 నుండి రూ.50వేల వరకు రుణాలు ఇప్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో రూ.50వేల వరకు రుణాలు ఇప్పించడంలో మన జిల్లా రెండోస్థానంలో ఉందన్నారు. అలాగే ఐదేళ్లు పూర్తయిన స్ట్రీట్ వెండర్లకు పీఎం విశ్వకర్మ కింద రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. దీనిపై నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్ మున్సిపాలిటీల్లో సమావేశాలు నిర్వహించి ఆర్పీలకు అవగాహన కల్పించామని తెలిపారు. అనంతరం సీనియర్ రిపోర్టర్ మురళీధర్‌ను ఘనంగా సన్మానించారు. సమావేశంలో మున్సిపల్ మెప్మా అధికారులు సునీత, ఆసియా, దేవపాల, బుచ్చమ్మలు, ఆర్పీలు పాల్గొన్నారు.



మురళీధర్‌ను సన్మానిస్తున్న ఇందిర తదితరులు

ఆన్‌లైన్ బెట్టింగ్‌కు యువకుడి బలి



మధు(ఫైల్)

జోగిపేట(అందోల్): ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పోగొట్టుకొని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అందోల్ గ్రామంలో చోటుచేసుకుంది. జోగిపేట ఎస్‌ఐ అరుణ్ కుమార్ గౌడ్ కథనం ప్రకారం.. జోగిపేటలోని ఒక బజ్జీలషాపులో పనిచేసే దాసరి మధు(21) కొంత కాలంగా బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. తన తండ్రి వద్ద నుండి రూ.25వేలు అవసరం ఉన్నాయని తీసుకొన్నాడు. ఆ డబ్బును ఆన్‌లైన్ గేమ్‌యాప్ ద్వారా బెట్టింగ్‌లో పెట్టి నష్టపోయాడు. ఈ విషయం ఇంట్లో తెలిస్తే కుటుంబ సభ్యులు ఏమంటారోనని భయపడి మనస్తాపంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి 24న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడిని కుటుంబ సభ్యులు సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. చేతికొచ్చిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదుపు తప్పి.. కిందపడి..

వెల్దుర్తి(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వెల్దుర్తిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. వెల్దుర్తి గ్రామానికి చెందిన కుమ్మరి నర్సింహులు(60)ను కుక్క కరవడంతో కౌడిపల్లి మండలం రాజ్‌పేటలో చెట్ల మందులు తాగడానికి గత ఆదివారం తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరుగి వస్తుండగా మంగళపర్తి గ్రామ శివారులో వాహనం అదుపుతప్పి కిందపడి కోమాలోకి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతడిని నర్సాపూర్, అక్కడి నుంచి సంగారెడ్డి, అనంతరం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు.

నాటుకోళ్లకు విష ప్రయోగం

తూప్రాన్: విషపూరితమైన గుళికలతో నాటుకోళ్ల చావుకు కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు. హైదర్‌గూడకు చెందిన సత్యనారాయణ కొంత కాలంగా తన పొలంలో నాటుకోళ్లను పెంచుతున్నాడు. పక్కనే వ్యవసాయ భూమి కలిగిన శీర్ల శివమల్లయ్య తన కోళ్లకు విషం కలిపిన గుళికలను వేయడంతో కోళ్లు చనిపోయినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడని, పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ వలలో రిటైర్డ్ పోలీస్ అధికారి

- రివార్డ్స్ పేరుతో సైబర్ మోసం
- రూ.2.91లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: రివార్డ్స్ పేరుతో వచ్చిన మెసేజ్‌కు స్పందించిన రిటైర్డ్ పోలీస్ అధికారి రూ.2.91లక్షలు పోగొట్టుకున్న ఘటన స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన రిటైర్డ్ పోలీస్ ఉద్యోగికి జూన్ 2న ఎస్‌బీఐ యోనో రివార్డ్స్ వచ్చాయంటూ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు లింక్‌ను క్లిక్‌చేసి, తన వివరాలను నమోదు చేశాడు. వెంటనే అతని ఖాతా నుంచి రూ.50 వేలు డ్రా అయినట్టు మెసేజ్ వచ్చింది. అనంతరం పలు దఫాలుగా మొత్తం రూ.2.91లక్షలు డెబిట్ అయినట్టు మెసేజ్ రావడంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మరో ఘటనలో రూ.5.52లక్షలు..

రాయికోడ్(అందోల్): మండలంలోని మాటూర్ శివారులోని ఓ కంపెనీ యజమాని నుంచి ఫేక్ ఈ మేయిల్ ఐడీతో సబర్ కేటుగాళ్లు రూ.5.52 లక్షలను కాజేశారు. స్థానిక ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని మాటూర్ శివారులోని ఓ చక్కెర ఫ్యాక్టరీ యజమాని మహేశ్ బండారి తన కంపెనీకి అవసరమైన పరికరాల కోసం తరుచూ కుంజ్ ఐమాక్స్ మెయిల్ ఐడీకి మెయిల్స్ పంపుతూ లావాదేవీలు నడుపుతుండేవాడు. అయితే గత నెల 29న ఒక మోటర్ కోసం ఆర్డర్ చేశాడు. సైబర్ నేరగాళ్లు మరో ఐడీతో క్వొటేషన్ పంపించారు. మహేశ్ బండారి అది నిజమని నమ్మి రూ.5.52 లక్షలను ట్రాన్స్‌ఫర్ చేశాడు. అనంతరం నిజమైన కంపెనీ ప్రతినిధులు మహేశ్‌కు ఫోన్‌చేసి డబ్బుల కోసం అడిగారు. దీంతో అతడు మోసపోయినట్టు గమనించి 1930కు కాల్‌చేసి ఫిర్యాదు చేశాడు. శుక్రవారం రాయికోడ్ పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.